# బుడగ

ఉదయం దీపావళి కథల పోటీలో

**నిన్న సాయంకాలమే అనుకుంటాను...**

**బజారునుండి వస్తుంటే రోడ్డు మీదనిలబడి ఓ వ్యక్తి చిన్నసీసా నుండి వేలకొద్దీ బుడగల్ని సృష్టించడం చూశాను.**

> ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా ఎవరి మానసిక శృంగార ప్రపంచం వారికుంది. అది ఎవరికి వారు సృష్టించుకునేది. ఆ భావనలు మెదడుపొరల్లో కప్పబడి ఉంటాయి. ఆ రహస్యాలను సభ్య ప్రపంచం ఎదుట నమోదు చేయడానికి ఎవరూ ఇష్టపడరు.

అంతకు ముందు అలాంటి దృశ్యం నేను చూడకపోలేదు.

కానీ ఈసారి ఆదృశ్యం నన్ను మరీ ఆకర్షించింది. చిన్నసీసాలోనివి సబ్బునీళ్ళు. అతనిచేతిలో ఉన్న 'బూర'లాంటి సాధనంతో ఊదుతున్నాడు.

బుడుగలు... బుడగలు..

రకరకాల రంగుల్లో మెరిసిపోతూ గాల్లోకి ఎగిరిపోతున్నాయి.

నాకు అవి బుడగలుగా అనిపించలేదు. నా జ్ఞాపకాలుగా నా కలలుగా కనిపించాయి. అందుకే వెంటనే నేనూ ఒకటి కొన్నాను.

ఆదివారం కావటంతో ఉదయం నుంచీ 'చిన్ని' ఎప్పుడు తీరిక దొరికినా బుడగల్ని సృష్టిస్తూనే ఉన్నాడు.

లేత నీరెండలో ఓ రకంగా, సాయం సమయాన మరో రకంగా బుడగలు గాల్లో తేలిపోతున్నాయి.

అవి ఆకాశంలో విహరిస్తున్న పక్షుల గుంపులా, భూలోక సంచారానికొచ్చిన దేవతల సమూహంలా కనిపిస్తున్నాయి. నాకెందుకో ఈ బుడగల గురించే ఆలోచించాలనిపిస్తుంది. నాలో మొట్టమొదటిసారిగా సౌందర్యదాహాన్ని కలిగించింది ఈ బుడగే అనుకుంటాను.

నా చిన్నతనంలో మా ఇంటి చూరు నుండి కారుతున్న వర్షపునీరు బుడగగా మారటమే నా కెంతో అద్భుతంగా ఉండేది.

ఒక్కోసారి పెద్ద బుడగ...

అందులో నాతోపాటు ఈ ప్రపంచం కనపడేది.

అత్యంత నిశ్శబ్దంగా అది చిట్లిపోయేది!

అది అలా చిట్లిపోతున్నపుడు భయంకరమైన విస్ఫోటనం జరిగి ఉంటుంది. కానీ ఆ శబ్దం నేనెప్పుడూ వినలేకపోయానే అనుకుంటాను.

దానికి కారణం అన్వేషిస్తే నాకు తెలిసింది—ఆ బుడగ సౌందర్యాన్ని ఆరాధించడంలో నిమగ్నమైన నాకు ఏ శబ్దాలు వినపించవని.

ఆ బుడగల్లా నేను నీలాకాశాన్నీ... పచ్చని చెట్లనూ ఏకకాలంలో గమనించేవాడ్ని.

ఈ ప్రకృతిలో రంగులున్నాయనే విషయాన్ని ఏ మాత్రం గుర్తించనంతగా మనం జీవితంలో ఇరుక్కుపోయేం... నాకుజీవితంలోనే మాధుర్యాన్నంతా ఈ బుడగలే చూపించాయి.

ఈ వయసు బుడగల్ని చూస్తున్నపుడు మరో రకం ఆలోచనలు వస్తున్నాయి.

జీవితమూ, మరణమూ, ఆశలూ, వీటన్నింటితోపాటు ఎందుకోసం ఈ జీవనం? మనం ఈ ప్రపంచంలోకి ఎందుకొచ్చాం? వీటన్నింటినీ బుడగల్తో పోల్చుకుంటా .

నాకనిపిస్తుంటుంది. గాల్లోకి దూసుకుపోతున్న ఆ బుడగల సమూహంలా మానవ జాతి విస్తరిస్తోంది. నాకు ఏ బుడగని చూసినా అందవికారంగా కనిపించదు.

ఒక్కోసారి నేనూహించినంత సేపు అస్తిత్వంలో ఉన్న బుడగలే నన్ను ఆశ్చర్యపరుస్తుంటాయి. మానవులంతా బుడగలంతఅందంగా లేరు. కొందరు అందవిహీనంగా, భయానకంగా కూడా ఉన్నారు.

ఈ బుడగలు మానవ జీవితంలో ఓ విడదీయరాని భాగం అనిపిస్తుంది. ఇవి ఏ వయస్సువారికి ఆ వయసుకు చెందిన ఆలోచనలను కలిగిస్తాయను కుంటాను.

అదికూడా పూర్తిగా వాస్తవం కాదు!

చిన్నటి బుడగలు తిరిగి నాలో ఆ జ్ఞాపకాల్ని ముందుకు తెస్తున్నాయి. పని మీద పది రోజుల పాటు ఆ మారుమూల ప్రాంతాలకు నేను వెళ్ళవలసి వచ్చింది. అక్కడ మంచినీళ్ళ సమస్యతో పాటు మంచి భోజనం సమస్యకూడా ఉంది. అయినా తప్పదు. వెళ్ళితీరాలి. వెళ్ళాను.

చిత్రంగా నేను బస్ దిగిన మరుక్షణం నా బాబాయిగారబ్బాయి కలిశాడు. చాలా సంవత్సరాల తర్వాత వాడిని చూడటం—అలాంటి మారుమూల గ్రామంలో వాడిని చూడగానే నాకు ఆశ్చర్యంకలిగింది. నన్ను చూసివాడూ అదేస్థితిలో ఉన్నాడు. ఆ తర్వాత వాడి గదికి తీసుకువెళ్లాడు. వాడు నాకు తమ్ముడవుతాడు.

స్నానం చేశాక కూర్చున్నాం. తను ఆ ప్రాంతాల్లో కాంట్రాక్ట్ చేస్తున్నాడు. మరో నెల రోజుల్లో అక్కడి పనులు పూర్తయిపోతాయి. పనులు అయ్యాక అక్కడి నుండి వెళ్ళిపోతాడు. మొత్తం మీద వాడు నాకోసమే ఇక్కడికివచ్చాడనిపించింది. నాకు లాడ్జి సమస్యలేదు.

హాయిగా నాకోసం ఆ గదిలో ఓ మంచం కేటాయించారు.

"మరి భోజనం ఎలా?" అన్నాను.

"హోటల్లోనే చేస్తున్నాం" అన్నాడు.

"బాగుంటుందా?" అన్నాను.

"ఫర్వాలేదు చూస్తావుగా" అన్నాడు.

ఆ తర్వాత మేమిద్దరం కలిసి వెళ్ళాం.

అప్పుడు చూశాను ఆ పాపని.

అప్పటివరకూ నేనువచ్చిన పనుల మీదా రోజువారీ జీవితపు ఆలోచనలమీదా ఉన్నానేమో ఆ పాపను చూడగానే ఒక్కసారిగా నేను నాకలల ప్రపంచంలోకి జారిపోయాను.

నా ముందు తిరిగి రంగురంగుల బుడగలు...

ఆ బుడగల్లో నాకు వేదాంతం కనిపించలేదు.

చాలాకాలం తర్వాత నాకెందుకో సేదతీరిన భావన. ఆ పాపంటే చిన్నపిల్లకాదు.పదిహేడు సంవత్సరాలు దాటే ఉంటాయి. నేను ఆ వయసులో ఉన్న చాలా మందిని 'పాప' అనే అంటాం. వారిని చూస్తున్నపుడు మా అమ్మాయిలానో, నా చెల్లి

లానో అనిపిస్తారు.

కానీ ఈ అమ్మాయిని చూస్తుంటే అదోరక మైన ఆధ్యాత్మిక భావనకలిగింది. ఆ మొఖంలో ఆ చిరునవ్వులో సెలయేటి గలగలలున్నాయి. ఆ అమ్మాయి మాట్లాడుతుంటే, నడుస్తుంటే, నవ్వుతుంటే అలానే చూస్తుండ పోవాలనిపించింది.

ఆ హోటల్ వారిదే. అక్కడ శాఖాహారంతో పాటు మాంసాహారంకూడా ఉంది. ఆ అమ్మాయి స్వయంగా వడ్డించింది. అంత సుకుమారమైన యువతి చేతి భోజనం ఎలావున్నా అద్భుతంగా ఉంటుందనుకుంటా. ఆ అమ్మాయికి సంబంధించిన దీన గాథను నా తమ్ముడు వివరించాడు.

ఆ అమ్మాయి తండ్రి కొద్ది సంవత్సరాల క్రితం ఏక్సిడెంట్‌లో మరణించాడు. ఆ అమ్మాయికో తమ్ముడున్నాడు. అతను చదువుకొంటున్నాడు. తండ్రి మరణం తర్వాత ఈ హోటల్ నిర్వహణవల్లేవారి సంసారం గడుస్తోంది.

ఆ అమ్మాయికోసం ఆ ప్రాంతం యువకులు ఎందరెందరో వస్తుంటారు. చిరునవ్వుతో అందరినీ ఆహ్వానిస్తుంది. ఆ అమ్మాయిని నిశితంగా గమనించాను... ఆ మొఖంలో ఎక్కడో ఏదోభావం కనిపించింది.

అదేమై ఉంటుంది?

తాను బయటకురాక తప్పని పరిస్థితుల పట్ల బాధా?

తను పెద్దకులంలో పుట్టి ఇలా బతకాల్సి వచ్చినందుకు ఆవేదనా?

తమకున్న ఆస్తిన్నీ విడిచి నలుగురి ముందుకు రావాల్సి వచ్చినందుకు చిన్నతనమా?

లేదా పెళ్ళిచేసుకొని తనకంటూ నిర్మించుకోవాల్సిన జీవితం దూరమౌతుందనా?




ఏమో? ఏమైనా కావచ్చు.

ఆ అమ్మాయిని చూస్తుంటే నాలో ఓ విధమైన కదలిక...

ఆమె గురించి నా ఆలోచనలన్నీ ఒకే విధంగా లేవు అది మాత్రం వాస్తవం.

నా వివాహం జరిగి ఒకటిన్నర దశాబ్దాలు ముగుస్తున్నాయి. నా శ్రీమతితో నా సంబంధాలు గతం లోకంటే బలమైన ఆప్యాయత, అవగాహనతో సాగుతున్నాయి. ఒకటి రెండు విషయాలు మమ్మల్ని రాజీపడేలా చేయనివ్వవు. అలా మాత్రం అభిప్రాయభేదాలు లేకపోయినా జీవితం మరీ నిస్సారంగా ఉంటుంది.

తనుకూడా నావల్ల మొదటి నుండీ అపారమైన నమ్మకాన్ని ప్రదర్శిస్తూ వచ్చింది. నాలోని నచ్చని లక్షణాల వల్ల ఆమె తిరగబడ్డా, ఇప్పటికే తిరగబడుతున్నా నేను లేని ప్రపంచాన్ని ఊహించుకోవడానికి ఆమె భయపడుతోంది.




మేం జీవితంతో చేసిన పోరాటం సామాన్యం కాదు. అన్ని ప్రతికూల అంశాల నడుమ మేం ఎదుగుతూ వచ్చాం. మేం మాకంటూ స్వర్గం నిర్మించుకోవాలని ఎంతో తపించాం.. అదయితే ఇంతవరకూ సాధించలేకపోయాం.

అవన్నీ తిరగబడుతుంటాయి.

ముఖ్యంగా నాలో!

చిన్నతనంనుండీ నాలో సౌందర్యపిపాస ఉంది. అది రకరకాల రూపాల్లో బయటపడుతుంటుంది. ఇలాంటి కోర్కెలు ఎందుకు తలెత్తుతున్నాయో నాకు తెలీదు.

నాలో తీవ్రమైన వాంఛలేవో ఉన్నాయి.

'స్త్రీ' విషయంలో నాకు కొన్ని బలహీనతలున్నాయి.

అలా అంటున్నానంటే నేను తిరుగుబోతుని ఏమాత్రం కాదు. కనిపించిన స్త్రీనల్లా అనుభవించాలనే ఆరాటమూ నాకు లేదు. అయితే...

చాలా కొద్ది మంది మాత్రమే అయినా నన్ను తీవ్రంగా ఆకర్షిస్తారు. వారితో శారీరక సంబంధం కన్నా మానసికపరమైన దగ్గరనే నేను కోరతాను.

నా మిత్రుడు మాత్రం ఈ విషయం అంగీకరించడు.

"ఎందుకా హిపోక్రసీ! నువ్వు ఈ విషయంలో ఊగిసలాడుతున్నావు. నీకు శారీరకంగానే ఆయా స్త్రీలు కావాలి. అమలిన శృంగారం అనేది కథల్లోనే ఉంటుంది. నీలాంటివారు పైకెంత అమలిన శృం
గార వంతులుగా కనిపించినా, మానసికంగా మీరు చేసేది మాత్రం వ్యభిచారమే" అన్నాడు.

అతని భాష కఠినంగా ఉంటుంది.

సరే తన అభిప్రాయాలే వో తను చెప్పాడు. మానసికమైన అనుభూతిని కూడా అతను పరిగణలోకి తీసుకున్నందుకు అభినందించాలి.

అయితే అందాన్ని ఆరాధించడం... మానసికంగా అనుభూతించటం వ్యభిచారం క్రింద వస్తుందా!

వ్యభిచారం అనే పదానికి అది అర్థమా?

నేననుకుంటాను. ఓ స్త్రీగానీ, పురుషుడుగానీ డబ్బు వెదజల్లి కామం తీర్చుకోవడం వ్యభిచారం అవుతుంది.

డబ్బే కాదు మరే కారణమైనా కావచ్చు. మరో ముక్కలో చెప్పాలంటే శృంగారానికి చెందిన ఇరువురి భాగస్వామ్యంలో ఏ ఒక్కరి అంగీకారమూ కక్కుర్తి వలన మాత్రమే జరిగేది వ్యభిచారం అవుతుంది.

మరి మానసిక ప్రపంచానికి చెంది ఈ నిర్ధారణకు సంబంధంలేదు.

అది ఎవరికివారు సృష్టించుకునేది. ఆ భావనలు మెదడు పొరల్లో ఎప్పటికప్పుడు కప్పబడి ఉంటాయి. ఆ రహస్యాలను సభ్య ప్రపంచం ఎదుట నమోదుచేయటానికి ఎవరూ ఇష్టపడరు. ఒకటి మాత్రమే వాస్తవం.

ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా ఎవరి మానసిక శృంగార ప్రపంచం వారికుంది.

అలా ఉండటానికి వారికి హక్కు ఉంది.

దాన్ని ఎవరూ తిరస్కరించలేరు.

తిరస్కరించి చేయగలిగిందికూడా ఏమీ లేదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే...

నాకు ఆ అమ్మాయి దగ్గర కావటంలోని అంశాల్ని కనుక్కోవడంతో పాటు ఆ అమ్మాయి పట్ల నాకెలాంటి భావాలున్నాయో నిజాయితీగా నేను విశ్లేషించుకోవాలనుకోవటం వల్ల తండ్రి లేని జీవితం గురించి నాకు తెలుసు. నా చిన్న తనంలోనే నా తండ్రి మరణించాడు. అప్పటినుండి నేనేం కోల్పోయానో నాకు బాగా అర్థమైంది— ఈ సంవత్సరాలన్నింటా.

నేను ఆ అమ్మాయిని అభిమానించడానికి ఇదో కారణం అయి ఉంటుంది. నా కెందుకో ఈ ప్రపంచంలో తండ్రిలేని వారినిగానీ, తల్లిలేనివారినిగానీ చూసినప్పుడు మేమంతా ఒకే కుటుంబంలో వ్యక్తులం అనిపిస్తుంది. మనుషుల్ని ఏకం చేసే అంశాల్లో మరొకటి దరిద్రం కూడానేమో! మేం అనుభవించినంతగా ఆ అమ్మాయి దరిద్రం అనుభవించ లేదు. అయినా డబ్బులేని వారిని బాధిస్తుంది.

ఈ రెండు అంశాలునన్ను ఆ అమ్మాయికి దగ్గర చేశాయి. ఇంక ఆ అమ్మాయిని ఏ రకంగా చూస్తున్నాననేది... ఆ అమ్మాయి తెలుపుకాదు... ఎరుపుకూడా కాదు. అలా అని నలుపూకాదు. మరీ ఎత్తూకాదు... పొట్టి కూడా కాదు.. స్త్రీలు ఎంత ఎత్తు ఉంటే అందంగా ఉంటారో అంత ఎత్తుమాత్రమే ఉందనుకుంటాను. ఆ అమ్మాయి కంఠ స్వరంలో తీయదనంతోపాటు ఇంకేదో కూడా ఉంది. ఆమెనడక... ఆ కళ్ళు... మొత్తంగా ఆ అమ్మాయి నన్ను కదిలించి.. ఊపేసింది!

నేను ఆ అమ్మాయిని ప్రేమించానా అనుకున్నాను. ఇక్కడ ప్రేమ అనే పదం సరైందికాదు. ఆరాధన అంటే సరిపోతుందేమో!

నాలోకి మూడున్నర దశాబ్దాలు చొచ్చుకొచ్చాయి. ఈ వయసులో ప్రేమలాంటి పదాలునాకు అవసరం లేదు. అందులోనూ పదిహేను సంవత్సరాల వైవాహిక జీవితం తర్వాత...

అయితే అరుదుగా నైనా...

ప్రయాణాల్లో కలల్లో ఎవరెవరో కనిపిస్తుంటారు. కొద్ది రోజులపాటు సంచలనాన్ని కలిగిస్తారు. ఆ తర్వాత ఆ వ్యక్తుల్ని మరిచిపోతాను. నేనూ నా శ్రీమతి జీవితాంతం కలిసి ఉండటానికి ఎప్పుడో నిర్ణయించుకున్నాం. అయితే ఆరాధన అనేది లేకుండా మాత్రం కాదనుకుంటాను. ఆ అమ్మాయిని నేను కామిస్తున్నానా అనేది ఇక్కడ ప్రధానమైతే నా ఆరాధనలో ఆ అంశంకూడా ఉండొచ్చు.

అదేం పెద్ద విషయంగా నేను భావించడం లేదు. అదెటూ జరిగితీరదనే అర్థంలో కాదు. ఒక్కో స్త్రీని చూసి ఒక్కో పురుషుడు ఒక్కో రకంగా స్పందిస్తాడు. ఒక్కో పురుషుడ్ని చూసి ఒక్కో స్త్రీ ఒక్కో రకంగా స్పందిస్తుంది. అందులోని ఆరాధనకు ఏది ప్రాధాన్యం అనేది ఆయా వ్యక్తుల్ని బట్టి కూడా ఉంటుందేమో. నా దృష్టిలో కామానికంటే ఆ అమ్మాయి దగ్గర నేను పొందిన విశ్రాంతికే ఎక్కువ ప్రాధాన్యత ఉంది.

ఎందుకిలా జరిగింది?

ఆ అమ్మాయి దగ్గర నా కెందుకా అనుభూతి కలిగింది? ఆ అమ్మాయితో కూర్చుని దశాబ్దాల తరబడి మాట్లాడాలని ఎందుకనిపించింది?

ఎందుకని ఆ అమ్మాయి చిరునవ్వు చూస్తూ కాలం గడిపేయాలనుకోవటం?

ఎందుకని ఆ అమ్మాయిని నా హృదయానికి హత్తుకోవాలనే భావం కలగటం?

ఓ తండ్రిలేని బిడ్డ అనేభావం.. ఓ ఆధ్యాత్మిక భావంతో పాటు ఎక్కడో కామపు వికారం లాంటిదుంటే దాన్నే ప్రధానంగా తీసుకోవాలా?

నాకు పెద్ద కొడుకు ఉంటే ఆ అమ్మాయిని చేసుకోవాలనిపించింది. పెళ్ళి కాని తమ్ముళ్ళుంటే వారికి ఆ అమ్మాయినిచ్చి వివాహం చేయాలని ఆరాటం కలిగింది.

నాకు తెలిసిన వారెవరైనా ఆమె చేయి అందుకుంటే బాగుండుననిపించింది.

ఇంకా....

ఆ అమ్మాయికి బంగారుభవిష్యత్ ఉండాలి..

ఈసారి నేను చూసేటప్పుడు ఆ కళ్ళలో దైన్యం కనపడకూడదు. తన భర్తతో, పిల్లలతో ఎంతో గర్వంగా నాకు కనిపించాలి . ఇలా పరస్పర భిన్నమైన ఊహాలు కలిగాయి.

మరో రకంగా చెప్పాలంటే...

ఆ అమ్మాయితో అమ్మనూ, చెల్లినీ, అక్కనూ, భార్యనూ, ఊహాసుందరినీ... మొత్తంగా స్త్రీని చూశాను. నా దృష్టిలో బుడగలుఒకటే.

అవి రకరకాల రూపాల్లో చిన్నవిగానూ, పెద్దవిగానూ ఉండొచ్చు. వాలోని ఈ చిత్రమైన వైరుధ్యాల పట్ల నన్ను నేను పరిశీలించుకున్నపుడు ఆశ్చర్యమూ, అసహ్యమూ, భయమూ కూడా కలుగుతాయి.

నా కలల ప్రపంచం మరీ అరాచకంగా ఉన్నట్లు అనిపిస్తుంది.

అయితే ఏ అరాచకమైనా, అనుభూతి అయినా నా మెదడు పొరల మాటున కప్పబడి ఉంటున్నాయి. కాబట్టి ప్రమాదంలేదు. కానీ అవన్నీ ఓ వెల్లువలా విరుచుకుపడితే?

నేనేమౌతాను?

అసలిన్ని వైరుధ్యాలేమిటి?

ఇవి నాకు సగం అర్థమవుతున్నాయి...

సగం అర్థం కావటం లేదు...!

నా తమ్ముడంటాడు...

"ఆ అమ్మాయిలో నిన్ను అంతగా ఆకర్షించిందేమిటి? బాగుంటుందనుకో.. అయినా నువ్వు చెబుతున్నంత గొప్ప విశేషం ఆమెలో లేదు. జస్ట్ బాగుటుందంతే"

నేను ఇంతగా ఆరాటపడుతున్న విశ్లేషించు కుంటున్న వ్యక్తి గురించి ఒక్కముక్కలో తేల్చేశాడు.

ఆ పదిరోజులూ ఆ అమ్మాయిని ఎంతో ఆబగాచూశాను. ఆ అమ్మాయినన్ను గమనించే ఉంటుంది....

ఇంటికి వచ్చాక కూడా ఆ అమ్మాయి జ్ఞాపకాలే... తిరిగి ఆ ప్రాంతాలకు వెళ్ళాలని ఆరాటం కలిగింది...

కానీ మనం అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగితే ఇంకేమైనా ఉందా?

ఆ అమ్మాయి నా కలగా, అనుభూతిగా మిగలాల్సిందే...

ఎప్పుడో జీవితంలో తప్పకుండా తారసపడుతుంది. అప్పుడు సంపూర్ణమైన స్త్రీగా చూసి తీరతాను! నా నమ్మకం అది!!

చిన్నఊదుతున్న సబ్బునురగబుడగలుగామారి గాల్లోకి ఎగురుతూనే ఉన్నాయి.

వాడికి ఆ బుడగల్లో రంగులే కనిపిస్తున్నాయో, ఇంకేమైనా ప్రపంచం కనిపిస్తుందో నాకుతెలియదు.

ఎందుకో వాడ్ని పిలవాలనిపించింది.

## రచయిత పరిచయం



ఓ దశాబ్దం క్రితం నేను రాసిన "సంచలనం విశ్చలనం" నవలికలకు ముందు మాటరాస్తూ పురాణం "ఈ రచయితకు లోకల్ కలరింగ్, వర్ణనా చాతుర్యం, ఏది ఎంతవరకు చెప్పాలో తెలిసి ఉంటే ఇంకా బాగా రాసి ఉండేవాడు కదా అని ఆశ చంపుకోలేక రాస్తున్నాను" అన్నారు. ఆనాటికి నాకు ఆవేశం తప్ప రచనలో శిల్పం గురించి బొత్తిగా తెలీదు. ఈ రోజు అంతా తెలిసిపోయిందని కాదు. గతం మీద కొంచెం మెరుగు. ఇన్ని సంవత్సరాల తర్వాత శ్రీ పురాణంగారి నుండి టెలిగ్రాం అందుకొని ఎంతో అనుభూతి చెందాను.

నా గురించి:

"బాలజ్యోతి"లో నా "అందమైన పూల తోట"కు మొదటి బహుమతి వచ్చింది.బాలల కోసం ఆ రచనను 'ప్రజాశక్తి' బుక్ హౌస్ వారు పుస్తకంగా ప్రచురించారు.


'స్వాతి' మాసపత్రికలో బాలల హృదయాన్ని విప్పిచెప్పే నా "మా హృదయం" బాలల్నే కాక మేధావుల్ని సైతం ఆకర్షించింది. ప్రస్తుతం ఆ సీరియల్ ఇంకా కొనసాగుతోంది. ఆంధ్రప్రభలో "జమిందారు కోట", పల్లకిలో "వాయిస్ ఆఫ్ చిన్నా" వస్తున్నాయి. "శ్వేత పత్రం" ఈ నదుమ విడుదలైంది. వివిధవార, మాస పత్రికల్లో నా కథలు ప్రచురించబడ్డాయి. ప్రచురించవలసి ఉన్నాయి.

కొన్ని ప్రముఖ వారపత్రికలలో నా సీరియల్స్ రానున్నాయి. బాలల కోసం రాస్తూనే నవలల్తోపాటు కథలు కూడా రాస్తుండాలనేది నా ఆరాటం.

'కథలకు' ప్రచురణ రంగంలోనూ, పత్రికలలోనూ కూడా ఆదరణ కొరవడుతున్న ఈ రోజుల్లో శ్రీ పురాణంలాంటి వారు గత వైభవాన్ని పునరుద్ధరించటంలో ఆయన వంతు పాత్రను నిర్వహించగలరని భావిస్తున్నాను.

"సృజన్‌సేన్", 'స్పందన్' మా అబ్బాయి

లు. ఎప్పుడూ నన్ను ఎంతగానో ప్రోత్సహించే నా శ్రీమతి 'జానకి' మాకోసం తన జీవితాన్ని అంకితం చేసుకున్న 'అమ్మ', నా రచనలు చదివి అభినందించే, అభిశంసించే నా మిత్రులూ, ఎంతో నేర్చుకోవాలనే ఆరాటం... 'గుమస్తా' ఉద్యోగం ప్రస్తుతానికి ఇదే నా ప్రపంచం.



స్కూల్ పడిపోతే సంతోషించక ఏడుస్తున్నా వెందుకురా?
టీచర్స్ అందరూ బయటనే వున్నారుగా అందుకని
—పి.శ్రీరామచంద్రమూర్తి

"చిన్నీ ఇలారా" అన్నాను.

వాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'ఏదీ ఇలా ఇవ్వు' అన్నాను.

అందించాడు.

నేనూ బుడగలు సృష్టించబోయాను నాకు చేతకాలేదు.

ఓ పెద్ద బుడగ బయటపడాలా వద్దా అనుకుంటున్న సమయంలో చిన్న అరిచేడు.

"నాన్నా బాబాయొస్తున్నాడు"

నేను ఆ బుడగను అలానే ఉంచి చిన్నికి ఇచ్చాను.

మేం ఇద్దరం కూర్చున్నాం.

పచ్చాపాటీ మాట్లాడుకున్నాక అడిగాను.

"ఏరా కాంట్రాక్టులై పోయాయా?"

"ఎక్కడా.. చేస్తున్నాం. నువ్వొచ్చిన చోట మాత్రం ఇంకలేవు"

"ఎప్పుడైనా వెళ్తున్నావా?"

"వెళ్తున్నా. ఈ నడుమ కూడా ఏదో బిల్లురావలసి వెళ్ళాను"

"ఆ హోటల్ ఉందా?"

వాడు నవ్వాడు. మెల్లగా వంగి చెప్పాడు.

"ఆ అమ్మాయి కూడా ఉంది. ఈ నడుమ ఆ అమ్మాయి ఎవరో అబ్బాయితో వెళ్ళిపోయిందంట. ఆ తీసుకవెళ్ళిన అబ్బాయి లక్షాధికారి కొడుకు"..

"అయితే" అన్నాను అదుర్దాగా

"ఆ అబ్బాయిని వాళ్ళు వెనక్కి తెచ్చారు" అన్నాడు.

"ప్రస్తుతం ఆ అమ్మాయి హోటల్లోనే ఉంది" వాడే అన్నాడు.

"ఇంతకూ ఆ అబ్బాయి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడా?"

చిన్న ఊదుతున్న గాలి బుడగలు గాల్లో ఎగిరి వస్తున్నాయి.

ఓ బుడగ నా ముందే చిట్లిపోయింది.

ఆ శబ్దం నేను వినగలిగాను

అయితే ఆ బుడగ ఎన్నిముక్కలైందో నేను చెప్పలేను.


●

# శుభం! శుభం! జన్మదినం


నవంబర్ 19వ తేదీ నుండి 25వ తేదీ లోపల పుట్టిన ప్రియ పాఠకులకు ఉదయం నవతరం వారపత్రిక శుభాకాంక్షలందిస్తోంది.



ఎస్.ఎస్.లత,
పుట్టినతేదీ
5.11.89,
హైద్రాబాద్.



పి.శ్రీనివాస్,
పుట్టిన తేదీ
6.11.89.
కారంచేడు



నక్కా భిక్షపతి,
పుట్టిన తేదీ
7.11.89,
రామాయంపేట.



యు.దయాసాగర్,
పుట్టిన తేదీ
8.11.89
రాంనగర్.



బి.రమ్యలక్ష్మి,
పుట్టిన తేదీ
9.11.89,
కొడమంచిలి.



హెచ్.మహేందర్
పుట్టిన తేదీ
10.11.89
హైద్రాబాద్.



శ్రీనివాస్,
పుట్టినతేదీ
11.11.89,
జగిత్యాల.

నవంబర్ 5వ తేదీ నుండి 11వ తేదీ లోపల పుట్టిన రోజు జరుపుకునే ప్రియ పాఠకులూ, మీ ఫోటోతో పాటు ఈ కూపన్ జత పరచి పంపండి ప్రచురిస్తాం.

**కూపన్**

పేరు:..........
ఊరు:..........
పుట్టినతేదీ:......
సంతకం:........

